TELANGANA CAPITAL

# తెలంగాణ క్యాపిటల్

నిజం.. నిజాయితీ.. నిబద్ధత

TELANGANA CAPITAL NEWS

www.telanganacapitalnews.com

హైదరాబాద్ | సంపుటి : 1 సంచిక: 30 | గురువారం, మే 9, 2024 | కంప్లిమెంటరీ కాపీ | పేజీలు : 4



## వేములవాడ రాజన్న సేవలో మోడీ

### ప్రత్యేక పూజల నిర్వహణ.... కోడె మొక్కు తీర్చుకున్న ప్రధాని

వేములవాడ, : సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బుధవారం మరోసారి తెలంగాణ పర్యటనకు వచ్చారు. వేములవాడ, వరంగల్ లలో నిర్వహించే బహిరంగ సభలలో ప్రసంగించారు. బుధవారం ఉదయమే హైదరాబాద్‌కు చేరుకున్న ఆయన రాజ్‌భవన్‌లో కాసేపు విశ్రాంతి తీసుకున్న తర్వాత బేగంపేట విమానాశ్రయం నుంచి హెలికాప్టర్‌లో వేములవాడకు చేరుకున్నారు. వేములవాడ రాజన్న ఆలయంలో శ్రీరాజరాజేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని కోడెమొక్కులు తీర్చుకున్నారు.

2వ పేజీలో...





## ఎన్నికల ప్రచారంలో వేగం పెంచిన మోడీ

### తెలంగాణలో సుడిగాలి పర్యటనలు

4వ పేజీలో...



- వేములవాడ, హన్మకొండ సభల్లో ప్రచారం
- ఎస్సీ,ఎస్టీ రిజర్వేషన్లలో కోతకు కాంగ్రెస్ కుట్ర
- మతపరంగా ముస్లింలకు కోటా ఇచ్చేలా వ్యూహం
- రాజ్యాంగపరంగా దక్కిన రిజర్వేషన్లపై కాంగ్రెస్ కన్ను
- అయోధ్యలో రామాలయ తీర్పును సమీక్షిస్తే ఊరుకుందామా?
- ఆదానీ,అంబానీలపై నోరు మెదపని కాంగ్రెస్
- కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలపై ఘాటు విమర్శలు
- డబుల్ ఆర్ టాక్స్‌కు చరమగీతం పాడుదామని పిలుపు



2వ పేజీలో...

## మరో రెండురోజులు అకాల వర్షాలు

### అప్రమత్తం చేసిన వాతావరణశాఖ

హైదరాబాద్, : తీవ్ర ఎండలకు అల్లాడిపోతున్న తెలుగు రాష్ట్రాలప్రజలు ఒక్కసారిగా ఊపిరి పీల్చుకున్నారు. ఇరు రాష్ట్రాల్లో దట్టమైన మబ్బులు, ఈదురు గాలులతో వాతావరణం చల్లబడింది. ఈ నేపథ్యంలో తెలంగాణ జిల్లాలకు భారత వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిక జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తుండడంతో వాతావరణశాఖ ఎల్లో అలెర్ట్ జారీచేసింది. వరుసగా రెండ్రోజులు వేర్వేరు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. కొన్ని జిల్లాల్లో ఈదురుగాలులతో తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. పోలీసుశాఖ కూడా అప్రమత్తమైంది.



2వ పేజీలో...

## ప్రమాదవశాత్తు సిఎంగా రేవంత్ రెడ్డి

### అబద్దాల ప్రచారంతో విమర్శలు దారుణం మండిపడ్డ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

హైదరాబాద్, : సీఎం రేవంత్ రెడ్డి అబద్ధపు ప్రచారాలపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ధ్వజమెత్తారు. ప్రమాదవశాత్తూ రేవంత్ రెడ్డి సీఎం అయ్యారని సంచలన వ్యాఖ్యలు చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో ఓడిపోతామన్న భయంతోనే బీజేపీపై ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. అబద్ధాలతో ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. గాడిద గుడ్డు పెట్టదు కానీ రేవంత్ రెడ్డి పెట్టించారని విమర్శించారు. ప్రతి పబ్లిక్ మీటింగ్‌లో గాడిద గుడ్డుతో వస్తుంటే.. రేవంత్ రెడ్డి పార్టీ గాడిద గుడ్డు పార్టీయా? ఆయన గుర్తు గాడిద గుడ్డా? అని తెలంగాణ ప్రజలు అనుకుంటున్నారని సెటైర్ వేశారు. బీజేపీ రిజర్వేషన్లను తీసేస్తుందని జరుగుతున్న ప్రచారంపై కూడా కిషన్‌రెడ్డి స్పందించారు. రాజ్యాంగం ద్వారా అంబేడ్కర్ ఇచ్చిన రిజర్వేషన్లను ఎవరూ తొలగించలేరని స్పష్టం చేశారు.

## వైసీపీ ప్రభుత్వానికి కౌంట్ డౌన్ మొదలు



- మాఫియా వికాసమే లక్ష్యంగా ఐదేళ్ల వైకాపా పాలన
- శాండ్ మాఫియాతో కొట్టుకుపోయిన అన్నమయ్య డ్యామ్
- జల్‌జీవన్ మిషన్‌కు సహకరించని జగన్ సర్కార్
- పులివెందులలో అరటి రైతుల కోసం క్లస్టర్స్ ఏర్పాటు
- ఎపి అభివృద్ధికి బుల్లెట్ ట్రైన్ ఇస్తాం
- కలికిరి ఎన్నికల ప్రచార సభలో మోదీ విమర్శలు

2వ పేజీలో...

అన్నమయ్య, : పేదల వికాసం కోసం కాదు.. మాఫియా వికాసం లక్ష్యంగా వైసీపీ సర్కార్ పనిచేస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ విరుచుకుపడ్డారు. ఆంధ్రప్రదేశ్‌లో డబుల్ ఇంజిన్ సర్కార్ రావాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. అన్నమయ్య జిల్లా కలికిరిలో జరిగిన బహిరంగ సభలో ప్రధాని మోదీ మాట్లాడారు. ఐదేళ్లలో రైతులు ఎక్కువగా ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. రాష్ట్రంలో మాఫియా రాజ్యం నడుస్తోందని.. వైసీపీ మంత్రులు గుండాగిరి చేస్తున్నారని విరుచుకుపడ్డారు. ఇక వారి ఆటలు సాగవని, వైసీపీ ప్రభుత్వానికి కౌంట్ డౌన్ మొదలయ్యిందని చెప్పారు. పోలవరం ప్రాజెక్టు నిర్మించడానికి రాష్ట్ర ప్రభుత్వం ముందుకు రాలేదని విమర్శించారు. జల్ జీవన్ మిషన్‌కు జగన్ సర్కార్ సహకరించలేదని ప్రధాని మోదీ నిప్పులు చెరిగారు. శాండ్ మాఫియాతో అన్నమయ్య డ్యామ్ కొట్టుకుపోయిందని గుర్తు చేశారు. రాయలసీమలో అపార ఖనిజ సంపద ఉందన్నారు. పర్యాటక రంగానికి అవకాశం ఉందని ప్రధాని మోదీ వివరించారు. పులివెందులలో అరటి రైతుల కోసం క్లస్టర్స్ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఏపీకి బుల్లెట్ ట్రైన్ ఇస్తామని స్పష్టం చేశారు. గత పదేళ్లలో చేపట్టిన మంచి పనులను కాంగ్రెస్ పార్టీ రద్దు చేస్తానని చెబుతోందని ప్రధాని మోదీ గుర్తుచేశారు.

## వ్యతిరేకులను నరికేయండి

### అప్పుడు మీరే సింగిల్ ప్లేయర్ వైఎస్ భారతికి షర్మిల కౌంటర్



2వ పేజీలో...

కడప, : ఓటమి భయంతో వైకాపా ఎంపీ అవినాష్‌రెడ్డి ఊరు దాటేందుకు సిద్ధమయ్యారని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విమర్శించారు. దీని కోసం పాస్‌పోర్టులు కూడా సిద్ధం చేసుకున్నారన్నారు. కడపలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. ఓడితే అరెస్టు తప్పదనే భయంతో అవినాష్‌రెడ్డి ఉన్నారని.. ఎంపీగా ఆయన గెలిస్తే నేరం గెలిచినట్లేనన్నారు. కడపలో వైకాపా సింగిల్ ప్లేయర్ అంటూ ఇటీవల సీఎం జగన్ సతీమణి వైఎస్ భారతి చేసిన వ్యాఖ్యలపై షర్మిల మండిపడ్డారు. వాళ్లే అధికారంలో ఉండాలి.. వాళ్లకు వ్యతిరేకంగా ఉన్నవాళ్లందరినీ నరికేయాలి.. వాళ్లే సింగిల్ ప్లేయర్‌గా ఉండాలి.. భారతి స్ట్రాటజీ ఇదేనా? గొడ్డలితో మిగతా వాళ్లనూ నరికేయండి.. అప్పుడు మీరే సింగిల్ ప్లేయర్. ప్రజలకు ఎంపీ అందుబాటులో ఉండాలంటే నాకు ఓటెయ్యండి. మీ ఎంపీని జైలులో కలవాలంటే అవినాష్‌రెడ్డికి ఓటెయ్యండి. దేవుడు మా వైపే ఉంటాడు.. గొడ్డలితో నరికే వాళ్ల వైపు కాదు‘ అని షర్మిల వ్యాఖ్యానించారు. ప్రధాని నరేంద్ర మోదీకి షర్మిల రేడియో గిఫ్ట్‌గా పంపారు. ఏపీ ప్రజల మన్ కీ బాత్ ఆయన వినాలని కోరారు. ఆయనకు రాష్ట్రంలో అడుగుపెట్టే అర్హత లేదని విమర్శించారు.

- బిజెపికి ప్రతిష్టాత్మక సీటుగా నగరం
- మాధవీలత ప్రచారంతో ఓవైసీకి ముచ్చెమటలు

హైదరాబాద్, : ఎవరీ మాధవీలత..అన్న దగ్గర నుంచి ఇప్పుడు జాతీయస్థాయిలో ఆమె పేరు మార్మోగుతోంది. నెటిజన్లు ఆమె గురించి తెగ సర్చ్ చేస్తున్నారు. అన్నింటి కీ మించి గతంలో ఎప్పుడూ లేనంతగా హైదరాబాద్ ఎఐఎం అభ్యర్థి అసదుద్దీన్ ఓవైసీ చెమటోడుస్తున్నాడు. మొత్తంగా ఇప్పడామె అసద్ ప్రత్యర్థి అని అర్థం అయివు ంటుంది. మరో నాలుగు రోజుల్లో సార్వత్రిక ఎన్నికల వేళ హైదరాబాద్ నుంచి బిజెపి నిలబెట్టిన మాధవీలత దేశం దృష్టిని ఆకర్శించారు. ఇక హైదరాబాద్ పార్లమెంట్ స్థానంపై బీజేపీ దృష్టి సారించింది. ఏ ఎన్నికల్లోనూ పెద్దగా పట్టించుకోని పార్టీ ఈసారి మాత్రం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. అభ్యర్థి ఎంపిక నుంచి ప్రచారం వరకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. అగ్రనేతలు, కేంద్ర మంత్రులు కూడా ఇక్కడ అభ్యర్థికి మద్దతుగా ప్రచారానికి వస్తున్నారు.



## మార్మోగుతున్న హైదరాబాద్ పేరు

2వ పేజీలో...



**బిఆర్ఎస్ ఛాప్టర్ క్లోజ్ అయినట్లే**
**పార్లమెంటులో ఒక్కసీటు కూడా రాదు**
**మోడీ మరోమారు గెలిస్తే..**
**ఇక నిరంకుశ పాలనే**
**మీట్ ద ప్రెస్ కార్యక్రమంలో**
**మంత్రి కోమటిరెడ్డి**

2వ పేజీలో...

## వచ్చే పదేళ్లు సిఎంగా రేవంత్ రెడ్డి

హైదరాబాద్, : వచ్చే పదేళ్లు తెలంగాణ ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డే ఉంటారని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చడమే గాకుండా, గత పాలకుల అవినీతిపైనా పోరాడుతుందని అన్నారు. ఎన్నికల తరవాత బిఆర్ఎస్ దుకాణం బంద్ అవుతుందనిఅ న్నారు. హైదరాబాద్ ప్రెస్‌క్లబ్లోఓ నిర్వహించాన మీట్ ది ప్రెస్‌లో కోమటిరెడ్డి హాట్ కామెంట్స్ చేశారు. జూన్ 5 న 25 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లోకి వస్తారన్నారు. బీఆర్ఎస్ దుకాణం ఖాళీ అవుతుందన్నారు. బీఆర్ఎస్ నుంచి నామినేషన్ వేసిన ఆరుగురు ఎంపీ అభ్యర్థులు కాంగ్రెస్‌లోకి వస్తామని తనను సంప్రదించారన్నారు. డీ లిమిటేషన్ తర్వాత తెలంగాణలో 154 సీట్లు అవుతాయన్నారు. 154 సీట్లలో 125 సీట్లు కాంగ్రెస్ గెలుస్తుందని కోమటిరెడ్డి తెలిపారు.

# ప్రమాదవశాత్తు సిఎంగా రేవంత్ రెడ్డి

**మొదటిపేజీ తరువాయి...**

రిజర్వేషన్లను తొలగించబోమని ప్రధాని మోదీ కూడా చెప్పారని గుర్తు చేశారు. ఎన్నికల్లో లబ్ది పొందేందుకు కాంగ్రెస్ తప్పుడు ఆరోపణలు చేస్తుందని ధ్వజమెత్తారు. బీజేపీని.. కురే కురే బీజేపీ అని మాజీ మంత్రి కేటీఆర్ చేసిన కామెంట్లపై కిషన్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. కేటీఆర్ చిల్లర గాడు! అన్ని చిల్లర మాటలు మాట్లాడుతారని అని మాస్ సెటైర్లు విసిరారు. కేటీఆర్ పేరు కూడా ఉచ్చరించడం కూడా తనకు ఇష్టం ఉండదని.. అందుకే ఎప్పుడూ ఆయన పేరు ప్రస్తావించనని అన్నారు. కేటీఆర్ కామెంట్లపై తాను స్పందించనని అన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ...రిజర్వేషన్లపై కాంగ్రెస్ చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రజలు ఖండిస్తున్నారని అన్నారు. రిజర్వేషన్ లబ్దిదారులే బీజేపీపై విశ్వాసంతో మద్దతు పలుకుతున్నారని చెప్పారు.కాంగ్రెస్ 'రిజర్వేషన్' ప్రచారం ఫెయిల్ అయిందని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిది బాధ్యతారాహిత్యమైన విమర్శ అని కొట్టిపారేశారు. వెనుకబడిన వర్గాలనుంచి ప్రధానమంత్రి నరేంద్రమోదీ వచ్చారని.. రిజర్వేషన్లు తొలగించరనే విశ్వాసం ప్రజల్లో ఉందని చెప్పు కొచ్చారు. బీజేపీకి పార్లమెంట్ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపిస్తారని చెప్పారు. దేశం, రాష్ట్రంలోఅత్యధిక స్థానాలు బీజేపీ గెలువబోతోందని ధీమా వ్యక్తం చేశారు.బీజేపీ పట్ల విపక్షాలు చేస్తున్న వ్యతిరేక ప్రచారం తమకు అంత సానుకూలంగా మారుతోంద న్నారు. గతంలో బీఆర్ఎస్ పార్టీ పదేళ్లు అవకాశం ఇచ్చారని అన్నారు. అంతకుముందు పదేళ్లు కాంగ్రెస్ అధికారంలో ఉందని అన్నారు. ఈసారి మెజార్టీ ఓట్లు, సీట్లు బీజేపీకే వేయాలని నిశ్చయించుకున్నారని చెప్పుకొచ్చారు.ఇది చూసి కాంగ్రెస్ పార్టీలో కలవరం పెరిగిందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగాల్లో ఈ అసహ నం కనబడుతోందన్నారు. బీజేపీ ప్రచారానికి ఊరూరా అద్భుతమైన స్పందన వస్తోందని చెప్పారు. ప్రజలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి.. బీజేపీకే తమ ఓటని చెబుతున్నారని కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

# వైసీపీ ప్రభుత్వానికి కౌంట్ డౌన్ మొదలు

**మొదటిపేజీ తరువాయి...**

రామమందిర నిర్మాణంపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును కూడా వెనక్కి తీసుకుంటానని చెబుతోందని మండిపడ్డారు. రామ మందిరానికి తాళం వేస్తానని అంటుందని ఆయన మండిపడ్డారు. కాంగ్రెస్ నేతలు దేశాన్ని విభజిస్తూ మాట్లాడుతున్నారు. గత పదేళ్లలో తమ ప్రభుత్వం చేపట్టిన పనులతో భారతదేశానికి గల్ఫ్ దేశాల్లో గౌరవం పెరిగిందని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీకి తెలుగుదేశం పార్టీ యువనేత నారా లోకేశ్ వెంకటేశ్వర స్వామి ప్రతిమను బహుకరించారు. ఆంధ్రప్రదేశ్ వికాసమే తన లక్ష్యమని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పునరుద్ఘాటించారు. అన్నమయ్య జిల్లా పీలేరు నియోజకవర్గంలోని కలికిరిలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో మోదీ ప్రసంగించారు. అనేక ఖనిజాలు, దేవాలయాలు కలిగిన నేల రాయలసీమ.. ఈ ప్రాంతంలో చైతన్యవంతులైన యువత ఉందన్నారు. రాయలసీమలో సాగునీటి ప్రాజెక్టులు లేవు, యువత ఉపాధి కోసం వలస వెళ్తున్నారు.

ఈ పరిస్థితి మారాలంటే ఆంధ్రప్రదేశ్‌లో డబుల్ ఇంజిన్ సర్కార్ రావాలి. నమ్మి అధికారంలోకి తెచ్చిన ప్రజలను వైకాపా మోసం చేసింది. ఐదేళ్లుగా ఏపీలో అభివృద్ధి లేదు. పేదల వికాసం కోసం కాదు.. మాఫియా వికాసం కోసం వైకాపా పనిచేసింది. వైకాపా ప్రభుత్వానికి కౌంట్‌డౌన్ మొదలైంది. ఇసుక మాఫియా కారణంగా అన్నమయ్య డ్యామ్ కొట్టుకుపోయింది. పుంగనూరులో ఐదేళ్లుగా రౌడీ రాజ్యం నడుస్తోంది. ఎన్డీయే అధికారంలోకి వచ్చాక అన్ని మాఫియాలకు పక్కా ట్రీట్‌మెంట్ ఇస్తాం. ప్రతీ ఇంటికి తాగునీరు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న జలజీవన్ మిషన్‌కు వైకాపా ప్రభుత్వం సహకారం అందించలేదు. ఐదేళ్లుగా రైతులు కూడా ఇబ్బందుల్లో ఉన్నారని అన్నారు. ఎన్డీయే ప్రభుత్వం వస్తే సాగునీటి ప్రాజెక్టులన్నీ త్వరితగతిన పూర్తవుతాయి. ఉపాధి కోసం వలస వెళ్లేవారిని అన్నిరకాలుగా ఆదుకుంటాం. గల్ఫ్‌కు వెళ్లే భారతీయులకు ఇప్పుడు గౌరవం పెరిగింది. ఖతార్‌లో చిక్కుకున్న భారతీయులను క్షేమంగా రప్పించాం.

కాంగ్రెస్ అధికారంలో ఉంటే ఇలా జరిగేది కాదు. అధికారంలోకి వస్తే ఆర్టికల్ 370ను మళ్లీ తీసుకొస్తామని కాంగ్రెస్ చెబుతోంది. భారత్.. విభిన్న జాతుల సమూహం అని చెబుతోంది. తెల్లవాళ్లు, నల్లవాళ్లు అనే ఆలోచనతో కాంగ్రెస్ నేతలు ఉన్నారు. అధికారం కోసం ఆ పార్టీ దేశాన్ని విభజించి పాలించాలని చూస్తోందని మండిపడ్డారు. నంద్యాల-ఎర్రకుంట్ల రైల్వే లైన్ పనులు పూర్తయ్యాయి. కడప-బెంగళూరు మధ్య కొత్త రైల్వే లైన్ మంజూరైంది. కడప విమానాశ్రయం కొత్త టెర్మినల్ నిర్మాణంలో ఉంది. వచ్చే ఐదేళ్లలో మౌలిక సదుపాయాల పనులు మరింత విస్తరిస్తాం. రైతుల జీవితాన్ని ఎన్డీయే ప్రభుత్వం మాత్రమే మార్చగలుగుతుంది. రాయలసీమలో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమను ప్రోత్సహిస్తాం' అని మోదీ హామీ ఇచ్చారు. తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్, మాజీ ముఖ్యమంత్రి, రాజంపేట ఎంపీ అభ్యర్థి కిరణ్‌కుమార్‌రెడ్డి, జనసేన ప్రధాన కార్యదర్శి నాగబాబుతో పాటు చిత్తూరు, అన్నమయ్య జిల్లాల నుంచి భాజపా, తెదేపా, జనసేన కార్యకర్తలు భారీగా తరలివచ్చారు.

## కాంగ్రెస్‌కు ఉగ్రవాద సంస్థల మద్దతు

**అధికారంలోకి వస్తే దేశం ఉగ్రవాద చేతుల్లోకి**

**ఎంపి ధర్మపురి అర్వింద్ హెచ్చరిక**

నిజామాబాద్, : కాంగ్రెస్ అధికారంలోకి వస్తే దేశం ఉగ్రవాదుల చేతుల్లోకి వెళ్తోందని నిజామాబాద్ బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ సంచలన వ్యాఖ్యలు చేశారు. టెర్రరిస్ట్ సంస్థలన్నీ కాంగ్రెస్‌కు మద్దతు ప్రకటించాయని తెలిపారు. ముస్లింలంతా కాంగ్రెస్‌కు ఓటెయ్యాలని సిమి ( స్టూడెంట్ ఇస్లామిక్ మూవెంట్ ఆఫ్ ఇండియా ) ప్రకటించిందని పేర్కొన్నారు. నిజామాబాద్ జిల్లా పార్టీ కార్యాలయంలో బుధవారం ధర్మపురి అర్వింద్ మీడియాతో మాట్లాడారు. ఈ ఎన్నికలు బీజేపీకి, టెర్రరిస్టులకు మధ్య జరుగుతున్నాయనే సందేహాలు కలుగుతున్నాయని ధర్మపురి అర్వింద్ పేర్కొన్నారు. నిషేధిత సంస్థ సిమిపై 15 టెర్రరిస్ట్ కేసులు కూడా ఉన్నాయని వెల్లడించారు. పీఎఫ్ఐ, సిమికి కాంగ్రెస్ మాతృసంస్థగా మారిందని విమర్శించారు. ఆ రెండు సంస్థలు కూడా కాంగ్రెస్‌కు ఫండింగ్ చేస్తున్నాయని ఆరోపించారు. ఒకవేళ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రభుత్వాన్ని ఆ సంస్థలే కంట్రోల్ చేస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. జగిత్యాల పీఎఫ్ఐకి అడ్డాగా, బోధన్ నకిలీ పాస్‌పోర్టులకు అడ్డాగా మారిందని అన్నారు. ఇలాంటి వారపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కాంగ్రెస్ కూటమిని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ వస్తే మళ్లీ సకల అవలక్షణాలు కూడా వస్తాయని అన్నారు. కేవలం కుటుంబ పాలనే లక్ష్యంగా కాంగ్రెస్ పావులు కదుపుతోందని మండిపడ్డారు.

## సుప్రీంకోర్టు ధర్మాసనం రాజ్యాంగ బద్ధంగా పనిచేయడం లేదు

తిరుపతి: తిరుపతి పల్లెవీధిలో వైసిపి కార్యకర్తలు నిన్న రాత్రి ఒక ఓటుకు 5వేల రూపాయలు పంపిణీ చేశారు. ఒక్క ఓటుకు 5వేల రూపాయలు ఇవ్వడమేంటని మాజీ ఎంపి చింతా మోహన్ ప్రశ్నించారు. డబ్బులను యథేచ్ఛగా పంచుకుంటే తిరుపతి జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్ కుమార్ ఏం చేస్తున్నారు..? జగన్మోహన్ రెడ్డి అక్రమంగా సంపాదించిన డబ్బులు తిరుపతిలో పంచుతున్నారా..? జగన్మోహన్ రెడ్డికి బెయిల్ ఇచ్చి కేజ్రీ వాల్ కు ఎందుకు ఇవ్వడం లేదు. కేజ్రీవాల్ పట్ల మోడీ కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారు. దమ్ముంటే కలికిరి పర్యటనకు వచ్చే మోడి దీనిపై సమాధానం చెప్పాలి. పత్రిక స్వేచ్ఛకు సంకెళ్లు వేసిన వ్యక్తి మోడీ. సుప్రీంకోర్టు ధర్మాసనం రాజ్యాంగబద్ధంగా పనిచేయడం లేదు. కేజ్రీవాల్ తప్పు చేస్తే సీఎం గా కొనసాగే అర్హత లేదా..? అదే ఎపి సిఎం తప్పు చేస్తే సిఎంగా కొనసాగవచ్చా..కోర్టు తీర్పులు గందరగోళానికి తెరతీస్తున్నాయి. కేజ్రీవాల్ కు ఒక తీర్పు.. జగన్ కు మరో తీర్పా.. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సమాధానం చెప్పాలని అన్నారు.

## మరో రెండురోజులు అకాల వర్షాలు

**మొదటిపేజీ తరువాయి...**

పిడుగులు పడే ప్రమాదం ఉండడంతో ఎవరూ చెట్ల కిందకు వెళ్లవద్దని, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలను తాగవద్దని హెచ్చరించింది. అలాగే, శిథిలావస్థలో ఉన్న భవనాలకు దూరంగా ఉండాలని, అత్యవసరమైతే 100కి డయల్ చేయాలని కోరింది. ఇకపోతే హైదరాబాద్‌లో భారీ వర్షం, ఈదురు గాలులతో నగరంలో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. చాలా చోట్ల ట్రాఫిక్ సమస్యలు, విద్యుత్ అంతరాయాలు ఏర్పడడంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అత్యవసరంగా సమీక్ష నిర్వహించారు. వరంగల్ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అక్కడి నుంచే జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్, సిటీ పోలీస్ కమిషనర్ కె.శ్రీనివాస రెడ్డి, ట్రాన్స్‌కో సీఎండీ ఎస్.ఏ.ఎం రిజ్వి, ఇతర ఉన్నతాధికారులతో సమీక్షించారు. భారీ వర్షాలు, ఈదురు గాలులతో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ముఖ్యమంత్రి వెంటనే సమస్యను పరిష్కరించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల్లో జలమయమైన కాలనీల్లో ప్రజలకు అవసరమైన చేయూతను అందించాలని సూచించారు.

నగరంలో ట్రాఫిక్ సమస్యను సాధ్యమైనంత త్వరగా క్లియర్ చేసి వాహనదారులు త్వరగా ఇళ్లకు చేరుకునేలా చూడాలని పోలీసు అధికారులను ఆదేశించారు. వివిధ శాఖల అధికారులు, సిబ్బంది చేపట్టే సహాయక చర్యల్లో భాగస్వాములు కావాలని, సమస్య తీవ్రత ఎక్కువగా ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ కార్యకర్తలకు సూచించారు.

## వేములవాడ రాజన్న సేవలో మోడీ

**మొదటిపేజీ తరువాయి...**



ప్రధానిమోడీ ఆలయ విశేషాలు అడిగి తెలుసు కున్నారు. ప్రధాని మోడీకి అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం చేయించారు. అనంతరం వేదాశీర్వచనం చేశారు. ఆలయంలోని మహానందికి పుష్పాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. గోమాతకు కూడా పూజలు నిర్వహించిననంతరం ఆలయంలో ప్రదక్షిణ చేస్తూ రాజరాజేశ్వర స్వామి గర్భాలయం వద్దకు చేరుకున్నారు. అక్కడ ఆలయ ప్రధాన అర్చకులు మోదీకి తిలకధారణ చేసి స్వామివారికి పుష్పార్చనలు నిర్వహించారు. తదనంతరం ప్రధాని మోదీ హారతి కళ్లకు అద్దుకుని మొక్కులు చెల్లించు కున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో, ప్రధాన అర్చకులు, వేద పండితులు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి వేద ఆశీర్వచనం అందజేశారు. ఆపై శాలువా కప్పి సన్మానించారు. స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఇక తిరుగుపయనం అయ్యే క్రమంలో క్యూ లైన్లలో వేచి ఉన్న భక్తులకు అభివాదం చేస్తూ, వందనం చేస్తూ బయటకు వచ్చారు. ప్రత్యేక హెలికాప్టర్ లో వేములవాడ బహిరంగ సభకు బయలుదేరారు. ప్రధాని రాకతో భారీ భద్రతను ఏర్పాటు చేశారు.

# మార్మోగుతున్న హైదరాబాద్ పేరు



**మొదటిపేజీ తరువాయి...**

మజ్లిస్‌కు కంచుకోటగా నిలిచిన హైదరాబాద్ సెగ్మెంట్‌లో పాగా వేయాలనే లక్ష్యంతో వ్యూహాత్మకంగా పావులు కదుపుతోంది. అందుకు అనుగుణంగా కొంత కాలంగా ఇక్కడ సేవా, ఆధ్యాత్మికంగా, ధార్మిక కార్యక్రమాలను చేపడుతున్న విరించి హాస్పిటల్స్ చైర్‌పర్సన్, లతమా ఫౌండేషన్ చైర్‌పర్సన్ మాధవీలత కొంపెల్లకు టికెట్ కేటాయించారు. అప్పటి నుంచి హైదరాబాద్‌లో బిజెపి గెలుస్తుందన్న ఒక టాక్ మాత్రం వచ్చింది. ఓవైసీ కూడా గతంలో లాగా ఈ ఎన్నికను తేలికగా తీసుకోలేక పోతున్నారు. కనుకుపట్టనంతగా ప్రచారంలో సాగుతున్నారు. అత్యధికంగా మైనార్టీ ఓట్లు ఉన్న ఇక్కడ బీజేపీ విజయం సాధించడం కష్టం.. గత పది పార్లమెంట్ ఎన్నికల్లో వరుసగా విజయం సాధిస్తున్న మజ్లిస్ను ఢీకొట్టడం సాహసమే అయినప్పటికీ ఇక్కడ గెలుస్తామనే ధీమాతో బీజేపీ అభ్యర్థి అడుగులు వేస్తున్నారు. మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ ఎక్కువ సార్లు దాదాపు రెండు లక్షల మెజార్టీతో ఇక్కడ విజయం సాధించారు. ఇలాంటి పరిస్థితిల్లో మరొకరు ఇక్కడ విజయం సాధించడం అంత సులువు అవుతుందా? అనేది ప్రశ్నార్థకమే. మరో వైపు మజ్లిస్‌కు బద్ద శత్రువు అయినా ఎంబీటీ కూడా బరిలో నిలువలేదు. మాధవీలత నామినేషన్ దాఖలకు కేంద్ర సమాచార ప్రసారాల శాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ హాజరయ్యారు. ఆమెకు మద్దతుగా బేగంబజార్‌లో నిర్వహించిన ప్రచారంలో రాజస్థాన్ రాష్ట్ర మంత్రి రాజ్‌వర్ధన్‌సింగ్ రాథోడ్ పాల్గొన్నారు. చార్మినార్ నియోజకవర్గంలో నిర్వహించే రోడ్డు షోలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పాల్గొన్నారు. ఆ తరవాత ఇప్పుడు పాతబస్తీ మార్మోగుతోంది. ఎక్కడికి వెళ్లినా మాధవీలత అన్న పేరు కనిపిస్తోంది. ఇంత వరకు హైదరాబాద్ పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో కేంద్ర మంత్రులు పెద్దగా పాల్గొన్నది లేదు. ఈ సారి అగ్రనేతలు హైదరాబాద్‌కు వస్తుండడంతో చాలా ఉత్కంఠ నెలకొంది. అమిత్‌షా రోడ్డు షోకు భారీ స్పందన వచ్చింది. అటు అభ్యర్థి, ఇటు అగ్రనేతలు హైదరాబాద్ ఎన్నికను సవాల్‌గా తీసుకోవడంతో ఓవైసీకి కూడా కంటిమీద కునుకు పట్టడం లేదు. ఇసి కూడా ఇక్కడి బూత్‌లపై దృష్టి పెట్టడానికి ఓవైసీ తప్పు పట్టారు. అంటే ప్రతి ఒక్కరూ ఇప్పుడు హైదరాబాద్ వైపు చూస్తున్నారు. అన్నింటికీ మించి మాధవీలత హావభావాలు, సేవానిరతి, అనర్గళంగా మాట్లాడే తత్వం అన్నీ ఇప్పుడు పాతబస్తీలో ప్రచారాస్త్రంగా దూసుకుపోతున్నాయి. బీజేపీ మొదటి జాబితాలోనే ఆమే పేరును ప్రకటించడంతో మాధవీలత ప్రచారంలో దూసుకెళ్తున్నారు. అన్ని నియోజకవర్గాల్లో విస్తృతంగా పర్యటిస్తున్నారు.గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ మినహా దాదాపు అందరు సీనియర్ నేతలు ప్రచారంలో పాల్గొంటున్నారు. నామినేషన్‌ను దాఖలు చేయడానికి ముందు నామినేషన్ పత్రాలను భాగ్యలక్ష్మి దేవాలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. చార్మినార్ నుంచి బీజేపీ నాయకులు కార్యకర్తలతో కలసి బ్యాండ్ మేళాలతో ఆమె అట్టహాసంగా బయల్దేరి వెళ్లారు. బోగసు ఓట్లు, పోలింగ్ బూత్‌ల్లో పోలింగ్ రోజు మజ్లిస్ అక్రమాలు పాల్పడుతుందని, వాటిని అడ్డుకుంటే ఇక్కడ విజయం సాధించడం సులువని ఆమె స్పష్టం చేస్తోంది. అలాగే మజ్లిస్ హాయంలో హైదరాబాద్ ఏం అభివృద్ధి జరగలేదని ప్రచారం చేస్తోంది. పాతబస్తీలో మజ్లిస్ ప్రాబల్యం ఉన్న ప్రాంతాల్లో కేంద్రం సంక్షేమ పథకాల ప్రచారాన్ని చేస్తున్నారు. ట్రిపుల్ తలాక్, మైనార్టీ వర్గాల కోసం ప్రధాని చేపట్టిన పథకాలు, విద్యార్థులకు స్కాలర్ షిప్స్, యువత ఉద్యోగ శిక్షణ కార్యక్రమాలపై ముమ్మరంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. అన్నింటికి మించి ఇన్నేళ్లుగా ఓవైసీ చేసిందేమిటన్న సవాళ్లతో మాధవీలత ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు. దీంతో దేశంలో హైదరాబాద్ నియోజకవర్గం ఇప్పుడు చర్చనయాంశంగా మారింది.

# వచ్చే పదేళ్లు సిఎంగా రేవంత్ రెడ్డి

**మొదటిపేజీ తరువాయి...**

కవిత బతుకమ్మ చుట్టూ తిరుగుతుంది అనుకున్నామని.. కానీ బతుకమ్మలో బ్రాండీ బాటిల్ పెట్టుకొని తిరుగుతుందని మేం గుర్తించలేదని కోమటిరెడ్డి అన్నారు. తలసాని శ్రీనివాస్ యాదవ్ కంటే శంకరమ్మకి తెలివి ఎక్కువ ఉందన్నారు. తలసాని మంత్రి ఎలా అవుతాడని ప్రశ్నించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ని ఫుట్ బాల్ ఆడుకుంటానన్న తలసాని మంత్రి అయ్యి గొర్రెలు, బర్రెలు, చేపలు తిన్నాడన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో క్యాంప్ పెట్టినప్పుడు మూడు రాత్రులు తాను కనీసం రూం నుంచి కాలు బయట పెట్టలేదన్నారు. కొందరు డిల్లీ వెళ్లి పైరవీలు చేసుకున్నారన్నారు. కానీ తాను మాత్రం ఎక్కడికీ వెళ్ళలేదని అన్నారు. కవిత వల్ల మన పరువు పోయిందని కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు.లోక్ సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఒక్క సీటు కూడా గెలువదన్నారు. జూన్ 4 తర్వాత తెలంగాణ భవన్ క్లోజ్ అవుతుందన్నారు. . కేసీఆర్ సచ్చిన పాములాంటోడన్నారు. కేసీఆర్ బస్సు యాత్రతో వచ్చేది లేదు.. సచ్చేది లేదని మంత్రి అన్నారు. ఈ ఎన్నికలు ఎంతో చాలా కీలకమన్నారు. రాముడి పేరు మీద బీజేపీ రాజకీయం చేస్తోందని విమర్శించారు. పదేండ్లు ప్రధానిగా ఉండి.. రాముడి పేరు చెప్పి ఓట్లు అడుక్కునే పరిస్థితి వచ్చిందని మోడీకి పట్టిందని ఎద్దేవా చేశారు. రిజర్వేషన్లపై మోదీ తప్పుడు ప్రచారం చేస్తున్నారని మంత్రి ఌ÷రైయ్యారు. ముస్లిం రిజర్వేషన్లు తొలగిస్తామని బీజేపీ నాయకులు మత కలహాలు రేపుతున్నారని మండిపడ్డారు. ఓట్ల కోసం బీజేపీ చిల్లర రాజకీయం చేస్తుందన్నారు. ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాల ముచ్చట ఏమైందని ప్రశ్నించారు. జీఎస్టీ పేరుతో భారీ మోసం జరుగుతుందని చెప్పారు. అంబానీ, అదానీ చేతుల్లోనే దేశ సంపద ఉందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ 14 నుంచి 15 సీట్లు గెలుస్తుందని మంత్రి కోమటిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తోందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి విమర్శించారు. మూడోసారి మోదీ ప్రధాని అయితే దేశంలో ఇక ఎన్నికలు ఉండవన్నారు.

మన దేశంలోనూ రష్యా, చైనా తరహా పాలన వస్తుందని సంచలన ఆరోపణలు చేశారు. రాజ్యాంగాన్ని మార్చి వాళ్లే పాలకులుగా ఉంటారని సంచలన వ్యాఖ్యలు చేశారు. 25 కోట్ల మంది ముస్లింల రిజర్వేషన్లు తీసేస్తామని ఎలా అంటారని బీజేపీకి కౌంటర్ వేశారు. వాళ్లంతా రోడ్ల మీదకు వస్తే ఏం జరుగుతుందో తెలుసా అని హెచ్చరించారు.

పదేళ్ల పాలనలో కేసీఆర్ కుటుంబం తెలంగాణను దోచుకుందని విమర్శించారు. ఈ రాష్ట్రంలో కేసీఆర్ శకం ముగిసిపోయిందని.. తెలంగాణ లోక్ సభ ఎన్నికల్లో

కాంగ్రెస్ మొత్తం 17 స్థానాలకుగానూ 14 సీట్లు గెలుచుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తమ పార్టీ లక్ష్యం 15 స్థానాల్లో విజయం సాధించడమని, అయితే 14 స్థానాల్లో గెలుస్తామన్న నమ్మకం తమకు ఉందని తెలిపారు. జూన్ 5 తరువాత దేశంలో చాలా మార్పులు వస్తాయన్నారు.

# వ్యతిరేకులను నరికేయండి

**మొదటిపేజీ తరువాయి...**

ఏపీ ప్రజలకు ప్రధాని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పదేళ్లు రాష్ట్రాన్ని మోసం చేసి ఎన్నికల కోసం మళ్లీ కపట ప్రేమ చూపిస్తున్నారని తెలిపారు. 10 ఏళ్లలో మోదీ చేసిన మోసాలపై 10 ప్రశ్నలు సంధిస్తున్నట్లు షర్మిల చెప్పారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ,తెలుగుదేశం అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు తో పొత్తుపెట్టుని.. వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డితో ఏ పొత్తు లేదన్నట్టుగా సభల్లో ఆయనను దూషిస్తున్నారని షర్మిల విమర్శించారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ ఈ తిప్పలన్నీ కేవలం మైనారిటీ ఓటు బ్యాంక్ కోసం ఆయన చేస్తున్నారని ఆరోపించారు. అంటే హిందూ , టీడీపీ , బీజేపీ ఓటు బ్యాంక్ ఇన్టాక్టుగా చంద్రబాబు పొత్తుతో ఉండాలని.. మిగతా మైనారిటీ ఓటు బ్యాంక్ అంతా జగన్ కార్నర్ చేసుకోగలిగితే.. ఈ రెండు ఓటు బ్యాంక్‌లు మళ్లీ మోదీకే లబ్ది చేకూరాలన్నది ప్రధాని స్టాటజీ అని షర్మిల వ్యాఖ్యానించారు. ప్రధాని మోదీగారు.. ఆంధ్ర రాష్ట్ర ప్రజలు పిచ్చోలు కాదు.. ప్రజల గుండెచప్పుడు ఒకసారి వినండి'.. అంటూ షర్మిల టేప్ రికార్డర్ ఆన్ చేశారు. మన్‌కీ బాత్‌లో మోదీ ప్రసంగిస్తుంటారని, ఈ విధంగా ఆయనకు చెబితే అర్థమవుతుందని తమకు అనిపించిందని ఆమె అన్నారు. ఏపీ మన్‌కీ బాత్ ఒకసారి ప్రధాని చెవిలో పడితే బాగుంటుందని ఆమె అన్నారు. 'గత పదేళ్లుగా ఏపీ ప్రజలకు అన్యాయం చేశారని, కాంగ్రెస్ పార్టీ ఆంధ్ర రాష్ట్ర ప్రజల పక్షాన ప్రధాని మోదీపై పదేళ్లకుగానూ పది చార్జస్‌తో ఒక చార్జ్ షీటు మీకు పంపిస్తున్నాం.. అది మీరు చదవండి.. మీ మీద పది అభియోగాలు ఏమున్నాయో ఒక సారి అర్థం చేసుకోండి.. ఆ చార్జ్ షీటు ప్రకారం ఏపీ ప్రజలకు లిఖితపూర్వంగా క్షమాపణ లేఖ రాసి.. రాష్ట్ర ప్రజల హక్కులన్నీ కాపాడతామని అఫిడవిట్ రాసిన తర్వాత ఆంధ్ర రాష్ట్రంలో అడుగుపెట్టాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తోందని' షర్మిల అన్నారు.

# మోడీ హయంలో ఉగ్రవాదం అంతమయింది

**రాజస్థాన్ సీఎం భజన్ లాల్ శర్మ**

రంగారెడ్డి: రాజేంద్రనగర్ నియోజకవర్గం లోని గగన్ పహాడ్ వద్ద చేవెళ్ల బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డితో కలిసి ప్రవాసీల తో చాయ్ పే చర్చా కార్యక్రమంలో రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్ లాల్ శర్మ పాల్గొన్నారు. రాజస్థాన్ సీఎం మాట్లాడుతూ 2024 పార్లమెంట్ ఎన్నికలు దేశ భవిష్యత్తును నిర్ణయించే అత్యంత ప్రతిష్టాత్మకమైనవి. దేశ సమగ్రతకు పెద్దపీట వేస్తున్న నరేంద్ర మోడీ మూడోసారి ప్రధాని కావాలంటే తెలంగాణలో స్థిరపడ్డ రాజస్థానీ వాసులతో పాటు దేశ ప్రజలంతా కమలం గుర్తుకు ఓటు వేయాలి. సేవా దృక్పథంతో రాజకీయాల్లోకి వచ్చిన కొండా విశ్వేశ్వర్ రెడ్డిని చేవెళ్ల నియోజకవర్గం నుండి భారీ మెజార్టీతో గెలిపించాలి. నరేంద్ర మోడీ ప్రధాని అయ్యాక దేశంలో ఉగ్రవాదం అంతమయింది. దేశ ప్రజలంతా సురక్షితంగా ఉంటున్నారు అంటే అది మోడీ ఘనత. 13వ తేదీన ప్రజలంతా తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకోవాలిని అన్నారు. కొండా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ తో చేవెళ్ల నియోజకవర్గం లో నా గెలుపు ఎప్పుడు నిర్ణయం అయిపోయింది. రెండు లక్షల ఓట్ల మెజార్టీతో చేవెళ్ల నుండి రెండోసారి ఎంపీగా విజయం సాధిస్తా. పదేళ్ల నరేంద్ర మోడీ పాలనను చూసి ఈసారి పార్లమెంట్ ఎన్నికల్లో కమలం గుర్తుకు ఓటు వేసి నన్ను ఎంపీగా గెలిపించాలని అన్నారు.

రాజస్థాన్ ప్రభుత్వ చీఫ్ విప్ నారాయణలాల్ పంచారియా మాట్లాడుతూ చేవెళ్ల నియోజకవర్గం నుండి కొండా విశ్వేశ్వర్ రెడ్డి భారీ మెజార్టీతో ఎంపీగా గెలుపొందడం ఖాయం . ఈసారి పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలో చేవెళ్ల, హైదరాబాద్ స్థానం సహా మెజార్టీ ఎంపి స్థానాలను బీజేపీ కైవసం చేసుకోవడం ఖాయం. రాజస్థాన్ లో 25 ఎంపీ స్థానాలకు 25 బీజేపీ గెలుచుకోవడం ఖాయమని అన్నారు.

## సంపాదకీయం

గురువారం, మే 9, 2024

### కుశల ప్రశ్నలుగా మోడీ ఇంటర్వ్యూలు

ప్రధాని పీఠంపై ఉన్న వ్యక్తిని కారణం లేకుండా ఎవరూ నిందించరు. ఆ నిందను నివృత్తి చేయవలసిన బాధ్యత ఆయనపై ఉంటుంది. తాను తప్పే చేయను అన్న అహంభావం ఆయన మాటల్లో ఉంది. రాముణ్ణి, కృషుణ్ణి వదలని వారు మోడీని వదులుతారా అని దానికి హిందూ మనోభావాన్ని జోడించారు. ఒక వైపు మోడీకి కీర్తించడం, మరో వైపు కాంగ్రెస్ పార్టీని, నేత లను విమర్శించే కోణంలోనే ఈ ఇంటర్వ్యూలు సాగాయి. విలేకరులు అడిగే ప్రశ్నల్లోనే కాంగ్రెస్‌పై వ్యంగ్యముంది. ఒకే దెబ్బతో రాహుల్ గాంధీ దేశంలోని పేదరికాన్ని పారద్రోలుతానంటున్నారు. అదెలా సాధ్య మని ఒక ప్రశ్న. అరవై ఏళ్లలో సాధించనిది చిటికెలో చేస్తారా అని ప్రధాని నవ్వు. ముఖ్యమంత్రిగా తన గుజరాత్ పాలనను పిట్ట కథలు చెబుతుంటే ఒక్కరూ ఆయన్ని వర్తమానానికి తెచ్చే ప్రయత్నం చేయలేదు. హిందూ దినపత్రికలో 5వ తేదీ నాడు సౌమ్యదీప్ సిన్హా ఒక కార్టూన్ వేశారు. 'ఇప్పుడు నేను మీ పనిని సులభం చేశాను. ప్రశ్నలు వేసే అవసరం లేకుండా నేను చెప్పింది వింటే చాలు' అని ప్రధాని మోడీ విలేకరులతో అంటున్న ట్లు అందులో ఉంది. ఈ మధ్య ఒక తెలుగు టివి ఛానల్, ఒక తెలుగు దినపత్రిక మోడీని విడివిడిగా ఇంటర్వ్యూ చేశాయి. వాటిని దృష్టిలో పెట్టుకొని ఆ కార్టూన్ వేశారో లేదో కానీ ఈ రెండు ఇంటర్వ్యూలకు ఆ కార్టూన్ వ్యాఖ్య సరిగ్గా సరిపోతుంది. ఢిల్లీలో ప్రధాని మోడీ నివాసానికి తొలుత టివి ఛానల్‌కు చెందిన అయిదుగురు వెళ్లి సుమారు గంటన్నర సేపు ఆయనతో రౌండ్ టేబుల్ చర్చను సాగించారు. ఆ తర్వాత మోడీ ఇంటికి తెలుగు దినపత్రికకు చెందిన ఇద్దరు వెళ్లి కొన్ని ప్రశ్నలు వేసి ఆయన జవాబులు రాసుకొచ్చారు. టివి ఛానల్ మాత్రం ఇది ఎవరూ సాధించని ఘనకార్యమని జబ్బలు చరుచుకుంది. ఈ టివి ఛానల్ బిజెపికి సమీప వ్యక్తికి చెందినది. ఆయనకు బిజెపి రాజ్యసభలో స్థానం కల్పిస్తామన్నా తెలంగాణ ప్రభుత్వంతో తమ వ్యాపారాలకు ఇబ్బంది రావద్దని తలచి ఆ ఆఫర్‌ను అందుకోలేదు. ఇక దినపత్రిక విషయానికొస్తే దాని యజమాని ప్రధాని మోడీని ఢిల్లీలో కలిశారు. బిజెపి జాతీయ అధ్యక్షుడు హైదరాబాదు వచ్చినపుడు ఆ పత్రికాధిపతి ఇంటికెళ్లారు. ఇలా ఆ రెండు ప్రసార మాధ్యమాలకు మోడీతో, బిజెపితో సత్సంబంధాలున్నాయి. ఎప్పుడూ పాత్రికేయులను దూరంగా ఉంచే మోడీకి ఇప్పుడు తన రిమోట్ సంస్థల కోసం ఈ ఇంటర్వ్యూలకు సిద్ధపడ్డారు. ప్రశ్నలన్నీ మోడీ గొప్పను, విపక్షాల ఎద్దేవాను లక్ష్యం చేసుకున్నాయి. వాటికీ మోడీ మరింత మసాలా అద్ది తన పదేళ్ల పాలన కన్నా ముందు అంతా శూన్యమే అన్నట్లు సుదీర్ఘ వివరణలిచ్చారు. ప్రతి జవాబులోను మోడీ తనకు తాను ఈ దేశానికి, ప్రజలకు లభించిన గొప్ప తత్వవేత్తగా, సంఘ సంస్కర్తగా అభివర్ణించుకున్నారు. దానిని అంగీకరిస్తున్నట్లు చిరునవ్వులతో తలలు అందించడమే పాత్రికేయుల పనిగా సాగింది. టివి ఛానల్ వారి తొలి ప్రశ్న పూర్తి కాకుండానే తన దిన చర్య ఇలా మొదలవుతుందో చెబుతూ మోడీ తన భాషణ చాతుర్యంతో అందరినీ తన్మయత్వంలోకి తీసికెళ్లారు. తాము ఆయన్ని ప్రశ్నించడానికి వచ్చామన్న విషయం మరిచిపోయి వాళ్లు మోడీకి జై కొట్టారు. అంతా ప్రీ ప్లాన్డ్ డ్రామాలా అనిపిస్తుంది. మీరు అభివృద్ధి చేసినా విపక్షాలు మిమ్మల్ని నిందిస్తుంటాయి అని ప్రశ్నిస్తే జవాబుగా మోడీ నవ్వుతూ డిక్షనరీలో ఉన్న తిట్లన్నీ అయిపోయి వారు కొత్త తిట్లు సృష్టించే అవసరం వచ్చింది అన్నారు. ఇన్ని తిట్లు పడిన నేతల్లో వరల్డ్ రికార్డ్ తనదే అన్నారు. శివుడు గళంలో గరళం దాచుకున్నట్లు తాను వాటిని మింగకుండా గొంతులో ఉంచానన్నారు. మోడీని తప్పుపట్టడమే తప్పు అన్నట్లుగా ఉంది ఆ సమర్థన. ప్రధాని పీఠంపై ఉన్న వ్యక్తిని కారణం లేకుండా ఎవరూ నిందించరు. ఆ నిందను నివృత్తి చేయవలసిన బాధ్యత ఆయనపై ఉంటుంది. తాను తప్పే చేయను అన్న అహంభావం ఆయన మాటల్లో ఉంది. రాముణ్ణి, కృషుణ్ణి వదలని వారు మోడీని వదులుతారా అని దానికి హిందూ మనోభావాన్ని జోడించారు. ఒక వైపు మోడీకి కీర్తించడం, మరో వైపు కాంగ్రెస్ పార్టీని, నేతలను విమర్శించే కోణంలోనే ఈ ఇంటర్వ్యూలు సాగాయి. విలేకరులు అడిగే ప్రశ్నల్లోనే కాంగ్రెస్‌పై వ్యంగ్యముంది. ఒకే దెబ్బతో రాహుల్ గాంధీ దేశంలోని పేదరికాన్ని పారద్రోలుతానంటున్నారు. అదెలా సాధ్యమని ఒక ప్రశ్న. అరవై ఏళ్లలో సాధించనిది చిటికెలో చేస్తారా అని ప్రధాని నవ్వు. ముఖ్యమంత్రిగా తన గుజరాత్ పాలనను పిట్ట కథలు చెబుతుంటే ఒక్కరూ ఆయన్ని వర్తమానానికి తెచ్చే ప్రయత్నం చేయలేదు. 2002 నాటి గుజరాత్ అల్లర్లకు ప్రత్యక్ష సాక్షి అయిన ఐపిఎస్ అధికారి సంజీవ్ భట్ జైల్లో ఎందుకున్నారు అని ఎవరూ ప్రశ్నించలేదు. పదేళ్ల పాలన ట్రైలరే. అసలు సినిమా ముందుంది అని కాంగ్రెస్ వాళ్ళను నిద్రకు దూరం చేశారు అని ఒకరి ప్రశ్న. ట్రైలర్ కాలంలో అక్టోబర్ 2020లో హత్రాస్‌లో జరిగిన గ్యాంగ్ రేప్ కవరేజికి వెళ్లిన రిపోర్టర్ సిద్దిఖీ కప్పన్‌ను ఉపా కేసు పెట్టి రెండేళ్లు జైల్లో ఎందుకు ఉంచారు అని సాటి విలేకరిగా ఒక్కరూ ప్రశ్నించలేదు. మణిపూర్‌లో ఏం జరుగుతోందని ప్రశ్నించే ధైర్యం ఎవరూ చేయలేదు. 400 సీట్లు వస్తే రాజ్యాంగాన్ని మారుస్తారని 'భ్రమ' ప్రజల్లో ఉంది అని ఓ ప్రశ్న. దాన్ని భ్రమగా విలేకరి ముద్ర వేయడం వింతగా ఉంది. గుజరాత్‌లో సిఎంగా ఉన్నపుడు రాజ్యాంగం 60 ఏళ్ల సమారోహంగా రాజ్యాంగ ప్రతిని ఏనుగుపై ఊరేగించానని, అదీ తనకు రాజ్యాంగంపైనున్న గౌరవమని మోడీ అన్నారు. 1976లో 42వ సవరణగా రాజ్యాంగ పీఠికలో చేర్చిన 'సెక్యులర్' అన్న పదాన్ని తీసేస్తామని రాజ్‌నాథ్ సింగ్ అంటున్న విషయం ప్రస్తావనకు రాలేదు. సెక్యులర్ అన్నపదం బిజెపికి ఎందుకు ఇష్టం లేదో అడిగేదెవరు? కాంగ్రెస్‌లో యువ నేతలంతా వెళ్ళిపోయి మావోవాదులు అందులో చేరారని అందుకే ఉన్నవారి ఆస్తులు లాక్కొని పంచుతామని అంటున్నారని మోడీ అన్నారు. కాంగ్రెస్‌లో ఉన్న మావోవాదుల పేర్లు చెబితే బాగుండేది. వెస్ట్ బెంగాల్ గొప్పతనాన్ని ఎర్ర పార్టీలు, తృణమూల్ కాంగ్రెస్ చెడగొట్టాయి. దాని పూర్వవైభవాన్ని తిరిగి తెస్తామన్నారు మోడీ. ప్రజలు ఇష్టపడి ఎన్నుకుంటేనే ఎవరైనా పాలించేది.

# భారత్ వెలిగిపోతోందా?

ప్రధాని మోడీ, బిజెపి నాయకులు చెబుతున్నట్లుగా భారతదేశం ఈరోజు మునుపెన్నడూ లేనంతగా వెలిగిపోతున్న మాట నిజమేనా? ప్రపంచ దేశాలకు భారత్ ఒక రోల్ మోడల్‌గా ఉన్నదా? భారత దేశాన్ని అలాంటి ఉన్నత స్థితిలో నిలపడం ద్వారానే మోడీ విశ్వగురు అయ్యారా? ఈ ప్రశ్నలకు సమాధానాలు తెలియాలంటే, వివిధ ప్రతిష్టాత్మక అంతర్జాతీయ సంస్థలు, వివిధ అంశాలలో తయారు చేసే వివిధ రకాల సూచీలను, ర్యాంకులను పరిశీలించాలి. దేశమంటే మట్టి కాదు మనుషులు అన్న గురజాడ సూక్తి ప్రకారం, ఒక దేశపు సమగ్ర అభివృద్ధి అంటే ఆ దేశ ప్రజల జీవన ప్రమాణాలలో, వారి స్థితిగతుల్లో, వారు అనుభవించే స్వేచ్ఛలో, సామాజిక గణాంకాల్లో, ఆర్థిక పరిస్థితుల్లో, వారు పొందే సూపరిపాలనలో అభివృద్ధిగా ఉంటుంది.మరి అటువంటి అంశాల్లో మన దేశం పరిస్థితి, మన దేశ ప్రజల పరిస్థితి ఎలా ఉందో ఒక పరిశీలన చేద్దాం. ఇటీవల మన ప్రధాని, మంత్రిగణం నోట్లోంచి తరచుగా వినిపిస్తున్న మాట "భారతదేశం ప్రపంచపు మూడవ అతి పెద్ద ఆర్థిక శక్తి కాబోతోంది".

అవును జిడిపి పరంగా 189 దేశాల్లో మనది 3వ స్థానం. కానీ జిడిపి పరంగా తలసరి ఆదాయంలో మన దేశం ఈ 189 దేశాల్లో 140వ స్థానంలో ఉంది. ఇది అత్యంత తీవ్రంగా పెరుగుతున్న ఆర్థిక అసమానతలను సూచిస్తోంది. ఈదేశపు బడా కార్పొరేట్లను ప్రపంచ కుబేరులుగానూ, ఈ దేశ పేద, మధ్య తరగతి ప్రజనీకాన్ని కటిక దారిద్ర్యంలోకి నెట్టే విధంగానూ పాలకుల విధానాలున్నాయి అన్నమాట. ఆర్థిక స్వాతంత్ర్యంలో 178 దేశాల్లో 123వ స్థానం, మానవ వనరుల వినియోగ సూచీలో 152 దేశాలకు గాను 115వ స్థానంలో ఉండడం, ఉద్యోగ కల్పనలో 47 దేశాల్లో 42వ స్థానంలోను, ప్రజలపై ఉన్న అప్పుల భారంలో 189 దేశాలకుగాను 82వ స్థానంలోను, కనీస వేతనాల అమలులో 156 దేశాలలో 64వ స్థానంలోను, మరీ ముఖ్యంగా ఆధునిక బానిసత్వ సూచీలో 167 దేశాల్లో నాల్గవ స్థానంలో వుండడంపై విషయాన్నే ధ్రువీకరిస్తున్నాయి.

పాలకుల స్వభావం ఆ ప్రభుత్వ ప్రాధమ్యాలలో స్పష్టంగా కనిపిస్తుంది. గ్లోబల్ హంగర్ ఇండెక్స్‌లో 107 దేశాలకుగాను 94వ స్థానంలోనూ, తలసరి ఆరోగ్య వ్యయంలో 190 దేశాలకు గాను 141వ స్థానంలోనూ, ఎడ్యుకేషన్ ఇండెక్స్‌లో 191 దేశాలకు గాను 145వ స్థానంలో ఉండగా మిలిటరీ వ్యయంలో 186 దేశాలకు గాను మూడవ స్థానంలో ఉండడం ఈ పాలకుల విధానాల్లో డొల్లతనాన్ని, సామ్రాజ్యవాద దేశాల ఆయుధ తయారీ కంపెనీలకు లొంగుబాటును, పొరుగు సరిహద్దు దేశాలతో చెడిపోతున్న సత్సంబంధాలను సూచిస్తోంది. పాలకుల విధానాలే ప్రజల జీవన ప్రమాణాలను నిర్ధారిస్తాయి. ప్రపంచ ఆయుష్షు సూచీలో195 దేశాలకు గాను 125 వ స్థానంలో ఉండగా, ప్రపంచ మానవాభివృద్ధి సూచిలో 189 దేశాలకు గాను 131వ స్థానంలో ఉండడం, సాంఘికాభివృద్ధి సూచీలో 128 దేశాలకు గాను 117వ స్థానంలో ఉండడం, గ్లోబల్ యూత్ డెవలప్మెంట్ ఇండెక్స్‌లో 183 దేశాలకు గాను 134వ స్థానంలో ఉండడం, నవజాత శిశుమరణాల్లో 223 దేశాలకుగాను 113వ స్థానంలో ఉండడం, లింగ తారతమ్యంలో 144 దేశాలకు గాను 108వ స్థానంలో ఉండగా, లింగ వివక్షలో 188 దేశాలకు గాను 76వ స్థానంలో ఉండడం, ఇళ్ళు లేని వారి విషయంలో 52 దేశాలకు గాను 8వ స్థానంలో ఉండగా, పట్టణీకరణలో 199 దేశాలకు గాను 161వ స్థానంలో ఉండడం, క్వాలిటీ ఆఫ్ లైఫ్ ఇండెక్స్‌లో 56 దేశాలకుగాను 43వ స్థానంలో ఉండడం, క్వాలిటీ ఆఫ్ ఎయిర్ ఇండెక్స్‌లో 92 దేశాలకు గాను 84వ స్థానంలో ఉండడం పాలకుల వినాశకర విధానాలను సూచిస్తోంది. 5జి యుగంలోకి తీసుకెళ్తున్నాము, అందరికీ ఇంటర్నెట్ విస్తరించాము అని బాజాలు కొట్టుకుంటున్న మన దేశంలో, జనాభాలో ఇంటర్నెట్ వాడే వారి శాతం ప్రకారం ప్రపంచంలోగల 228 దేశాల్లో 141వ స్థానం లోనూ, అలాగే ఇంటర్నెట్ స్పీడ్‌లో 149 దేశాలకుగాను 89వ స్థానంలో ఉండడం దయనీయమైన వాస్తవాన్ని తెలియజేస్తోంది.

ప్రపంచ సంతోష సూచీలో 156 దేశాలకు గాను 137వ స్థానంలో ఉన్న మన దేశం, ప్రపంచ శాంతి సూచీలో 163 దేశాలకు గాను 139వ స్థానంలో ఉండగా, ఉద్దేశపూర్వక జనహనన కేసుల్లో 219 దేశాలకుగాను రెండవ స్థానంలో ఉండడం, ట్రాఫిక్ ప్రమాదాల వలన జరిగే మరణాల్లో 180 దేశాలకు గాను రెండవ స్థానంలో ఉండడం, ఆత్మహత్యల రేటులో 176 దేశాలకు గాను 19వ స్థానంలో ఉండడం ఆందోళనకరం. "ఎక్కడ పుడితే బావుంటుంది" అనే అంశం మీద 80 దేశాల పౌరులపై చేసిన విశ్లేషణలో మన దేశానికి 72వ ప్రాధాన్యత లభించింది. ప్రజా శ్రేయస్సు సూచికలో 149 దేశాలకు గాను 101వ స్థానంలో ఉండడం, ప్రజాస్వామ్య సూచికలో 112 దేశాలకు గాను 65వ స్థానంలో ఉండడం, చట్టబద్ధ పాలన సూచీలో 113 దేశాలకు గాను 68వ స్థానంలో ఉండడం, పత్రికా స్వేచ్ఛలో 180 దేశాలకు గాను 148వ స్థానంలో ఉండడం, పాలకుల ఫాసిస్టు పోకడలను, నిరంకుశ విధానాలను ప్రతిబింబిస్తోంది.

పై గణాంకాలన్నీ ఐక్యరాజ్యసమితి, దాని అనుబంధ సంస్థలు, వరల్డ్ బ్యాంక్ లాంటి అంతర్జాతీయ సంస్థలు ఎంతో శాస్త్రీయంగా తయారు చేసినవే. వ్యవస్థీకృత సోషల్ మీడియా నెట్‌వర్క్, వాట్సాప్ యూనివర్సిటీ సహాయంతో ఫేక్ పోస్టుల ద్వారా, తమ లోప భూయిష్ట పాలనను అద్భుతమైన పాలనగా చిత్రీకరించు కుంటున్నారు కేంద్ర బిజెపి పాలకులు. తమకి తామే విశ్వగురు, 56 అంగుళాల ఛాతీ వంటి ప్రశంసలు ఇచ్చేసుకుంటున్నారు. దేశం వెలిగిపోతోందని నమ్మబలుకుతూ, ప్రజలకు వాస్తవాలు అర్థం కానివ్వకుండా వారిలో కులమతాల విద్వేషాలు నింపుతున్నారు. మరోసారి మందిరం ముసుగుతో అధికార పీఠం ఎక్కేస్తే, ఇక రానున్న ఐదేళ్లలో రాజ్యాంగ మౌళిక అంశాలను కూడా మార్చేసి, ఒకే దేశం, ఒకే పార్టీ, ఒకే మతం, ఒకడే రాజు–అన్న చందంలో అఖండ హిందూ సామ్రాజ్య స్థాపన వైపు దేశాన్ని తీసుకెళ్లే కార్యక్రమం నిర్విఘ్నంగా కొనసాగిద్దామనుకుంటున్న వీరు ఒక్క విషయం మర్చి పోతున్నారు. నిప్పుని పొట్లం కట్టి జేబులో దాచే ప్రయత్నం చేస్తే, అది జేబుని దహించుకుంటూ బయటికొచ్చి తన ఉనికిని చాటుతుంది. అలాగే మెజారిటీ ప్రజల పరిస్థితి అత్యంత అధ్వానంగా ఉంటే, ఈ విషయాన్ని మరుగుపరిచి అంతా ఘనంగా ఉందంటూ నమ్మబలికే ప్రయత్నం ఎంత తీవ్రంగా చేసినా.. పై గణాంకాలు వాస్తవాన్ని ప్రపంచం ముందు ఆవిష్కరిస్తున్నాయి. వివిధ కీలక అంశాల్లో మన పాలకుల వైఫల్యాలను, నిర్లక్ష్యాన్ని, తప్పుడు ప్రాధాన్యతలను ఎత్తి చూపుతున్నాయి. ఈ గణాంకాలు సోషల్ మీడియా, ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా వంటి సాధానాల ద్వారా విస్తృత జన బాహుళ్యానికి తక్షణం చేరాల్సిన అవసరం ఉంది. ప్రజలు నిన్ను నీ మాటలను బట్టి కాక, నీ చేతలను బట్టి అంచనా వేస్తారనే స్పృహ లేని ఈ పాలకులకు పై గణాంకాలను బట్టి జరుగుతున్న ఎన్నికల్లో తగిన శాస్తి తప్పకుండా జరుగుతుంది.

# ఔషధాల ధరలకు రెక్కలు

పేటెంట్ నిబంధనలకు ఇటీవల చేసిన సవరణ జెనరిక్ ఔషధ ఉత్పత్తికి అదనపు అడ్డంకులను సృష్టించింది. తద్వారా పేటెంట్ హెూల్డింగ్ కంపెనీలు ఎక్కువ కాలం పాటు గుత్తాధిపత్య ధరలను వసూలు చేయడానికి వీలు కల్పిస్తుంది. స్విట్జర్లాండ్, నార్వే, ఐస్‌లాండ్, యూరోపియన్ ఫ్రీ ట్రేడ్ అసో సియేషన్‌తో భారత ప్రభుత్వం స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై సంతకం చేసిన ఐదు రోజుల తర్వాత, సవరించిన నియమాలు 15 మార్చి, 2024న నోటిఫై చేయబడ్డాయి. బహుళజాతి ఫార్మా కంపెనీలు పేటెంట్ కొరకు భారత ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నాయి. హుళజాతి ఫార్మాస్యూటికల్ కంపెనీలు భారతీయ మార్కెట్‌లో అధిక ధరలకు అనేక ఔషధాలను సులభతరంగా అమ్మడానికి కేంద్ర ప్రభుత్వం తన పేటెంట్ నిబంధనలను సవరించింది. పేటెంట్ అనేది కొత్తగా కనిపెట్టిన ఉత్పత్తులపై పెట్టుబడిదారీ కంపెనీలు అనుభవిస్తున్న గుత్తాధిపత్యం ఒక రూపం. ఒక ఫార్మా కంపెనీ కొత్త ఔషధం కోసం పేటెంట్ పొందినప్పుడు, ఆ ఔషధాన్ని ఉత్పత్తి చేసి విక్రయించే ఏదైనా ఇతర కంపెనీ లేదా వ్యక్తి విక్రయించిన ప్రతి యూనిట్‌కు రాయల్టీ అని పిలువబడే రుసుమును పేటెంట్ హెూల్డింగ్ కంపెనీకి చెల్లించాలి. అందువలన, పేటెంట్లు పెట్టుబడిదారీ కంపెనీలు సృష్టించే ఏదైనా కొత్త ఉత్పత్తిపై గుత్తాధిపత్యాన్ని కొనసాగడానికి ఉపయోగ పడుతాయి. విపరీతమైన ధరలను వసూలు చేయడం, సమాంతర దిగుమతులను నిషేధించడం (చట్టబద్ధంగా విదేశాల్లో ఉత్పత్తి చేయబడిన పేటెంట్ ఉత్పత్తిని దిగుమతి చేసుకోవడం), ప్రత్యేకమైన లైసెన్సింగ్ ఒప్పందాల ద్వారా సరఫరాను పరిమితం చేయడం, ఆవిష్కరణలను కనిష్టంగా సవరించడం ద్వారా అసలు పేటెంట్ జీవితకాలానికి మించి పేటెంట్లను కొనసాగించడం, పేటెంట్ హెూల్డర్లు తమ గుత్తాధిపత్యాన్ని నిలుపుకోవడం కోసం సాధారణంగా చూసే పద్ధతులు. ఔషధ పరిశ్రమలో, ఇటువంటి పేటెంట్ విధానాలు ఔషధ తయారీదారులు దిగుమతి చేసుకున్న మందులకు అధిక ధరను వసూలు చేయడానికి వీలు కల్పిస్తాయి. వారు జనరిక్ ఔషధాల ఉత్పత్తికి అదనపు అడ్డంకులను సృష్టిస్తారు. ఇది దేశంలో ఔషధాల ధరలకు దారితీసే అవకాశం ఉంది. పేటెంట్ జీవితకాలం ముగిసినప్పుడు, ఇతర తయారీదారులు వారి స్వంత సాంకేతికతను ఉపయోగించి అదే ఔషధాన్ని ఉత్పత్తి చేయవచ్చు. ఇటువంటి మందులను జెనరిక్ మందులుగా సూచిస్తారు, ఇప్పుడు ఉత్పత్తిపై గుత్తాధిపత్యం ఏ ఉత్పత్తిదారుడు కలిగి



ఉండనందున చాలా చవకగా ఉంటాయి. పేటెంట్ నిబంధనలకు ఇటీవల చేసిన సవరణ జెనరిక్ ఔషధ ఉత్పత్తికి అదనపు అడ్డంకులను సృష్టించింది.తద్వారా పేటెంట్ హెూల్డింగ్ కంపెనీలు ఎక్కువ కాలం పాటు గుత్తాధిపత్య ధరలను వసూలు చేయడానికి వీలు కల్పిస్తుంది. స్విట్జర్లాండ్, నార్వే, ఐస్‌లాండ్, యూరోపియన్ ఫ్రీ ట్రేడ్ అసోసియేషన్‌తో భారత ప్రభుత్వం స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై సంతకం చేసిన ఐదు రోజుల తర్వాత, సవరించిన నియమాలు 15 మార్చి, 2024న నోటిఫై చేయబడ్డాయి. బహుళజాతి ఫార్మా కంపెనీలు పేటెంట్ కొరకు భారత ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నాయి. భారత దేశంలోని పేటెంట్ వ్యవస్థ ఏదైనా భారతీయ పౌరుడు, ఇతర దేశాల వారు కూడా పేటెంట్ మంజూరు కాకముందే వ్యతిరేకతను దాఖలు చేయడానికి అనుమతిస్తుంది. దీన్నే 'ప్రీ గ్రాంట్ ప్రతిపక్షం' అంటారు. బహుళజాతి ఫార్మా కంపెనీలు ముందస్తు మంజూరు వ్యతిరేకతను అనుమతించడం ఇష్టం లేదు. కొత్త పేటెంట్ నియమాలు ఈ నిబంధనను గణనీయంగా తగ్గించాయి. ప్రతి సంవత్సరం సమాచారాన్ని అందించడానికి బదులుగా, పేటెంట్ పొందిన వ్యక్తి దానిని మూడు సంవత్సరాలకు ఒకసారి మాత్రమే సమర్పించాలి. ఆర్జించిన ఆదాయంపై సమాచారం ఇవ్వాలనే నిబంధన పూర్తిగా తొలగించబడింది. అలాగే ఔషధం దిగుమతి చేసుకున్నదా అనే సమాచారం ఉంది. పేటెంట్ పొందిన వ్యక్తి భారత దేశంలో పేటెంట్ పని చేసిందో లేదో సూచించే పెట్టెను టిక్ చేయాలి. ఇది తప్పనిసరి లైసెన్సింగ్‌ను మరింత కష్టతరం చేస్తుంది. పేటెంట్ నిబంధనలలో ఇటీవలి సవరణలు భారతీయ ప్రజల ఖర్చుతో బహుళ జాతి కంపెనీల లాభాలను పెంచి మన దేశంలో అవసరమైన మందుల ధరలను గణనీయంగా పెంచే అవకాశం ఉంది.

# ఐక్యతకు ప్రతీక ఇయు

యూరోపియన్ యూనియన్ (ఇయు) పౌర సమాజం 09 మే రోజున 'యూరోప్ దినోత్సవాన్ని (యూరోప్ డే)' ఘనంగా నిర్వహించుకోవడానికి యూరోప్ దేశాలు సిద్ధంగా ఉన్నాయి. యూరోప్ ప్రాంతంలో 44 దేశాలు ఉండగా, యూరోపియన్ యూనియన్‌లో జర్మనీ, ఫ్రాన్స్, స్పెయిన్, స్వీడన్, డెన్మార్క్, బెల్జియమ్, బర్గేరియా లాంటి 27 దేశాలు మాత్రమే సభ్యులుగా ఉన్నారు. 2002లో ఈయూ దేశాలు 'యూరో' కరెన్సీని ఆమోదించి అమలులోకి తేవడం ఓ గొప్ప విశేషం. యూరోప్ సమాజం అనేక స్థాయిల్లో సమావేశాలు ఏర్పాటు చేసుకొని, గతాన్ని విశ్లేషించుకొని రేపటి వెలుగుల కోసం ప్రణాళికలు సిద్ధం చేసుకోవడం జరుగుతుంది. ఇయూ పార్లమెంట్, కమీషన్, ఇతర ప్రముఖ సంస్థలతో పాటు ప్రపంచ పౌరసమాజం కూడా యూరోప్ దినం పాటించుట ఆనవాయితీగా వస్తున్నది. యూరోప్‌లో రాజకీయ ఏకీకరణ కోసం 09 మే 1950 రోజున ప్రయత్నించిన 'రాబర్ట్ షుమన్' ప్రతిపాదించిన 'షూమన్ డిక్లరేషన్'కు గుర్తుగా 09 మే రోజున 'యూరోప్ డే'గా 1985 నుంచి నిర్వహించుట జరుగుతున్నది. షూమన్ ప్రతిపాదనలతోనే 'యూరోపియన్ యూనియన్' భావన మ్మొలకెత్తింది. యూరోప్‌లోని ఫ్రెంచ్, జర్మనీ దేశాలు బొగ్గు, స్టీల్ పరిశ్రమలను ఏకం చేసి "యూరోపియన్ కోల్ అండ్ స్టీల్ కమ్యూనిటీ' నీడన చేర్చి ఉత్పత్తులు చేయడం 18 ఏప్రిల్ 1951న ప్రారంభమైంది. యూరోప్ దినం వేదికగా యూరోపియన్ సమాజం చర్చలు, ఉపన్యాసాలు, నాటికలు, కచేరీలు, వేడుకలు లాంటి పలు కార్యక్రమాలను ఏర్పాటు చేస్తారు. ఆధునిక యూరోపియన్ సమాజం ముందున్న సవాళ్ళను విశ్లేషిస్తూ, ప్రజాక్షేమం వైపుకు ప్రగతి దారులు వేయుటకు కృషి చేయటం జరుగుతుంది. 29 జూన్ 1985న యూరప్ డే, యూరోప్ పతాకం కూడా అమోదించుట జరిగింది. 'యూరోప్‌లో శాంతి, ఐక్యత (పీస్ అండ్ యునిటీ ఇన్ యూరోప్)' కోసం 05 మే రోజున 'కౌన్సిల్ ఆఫ్ యూరోప్', 09 మే రోజున 'యూరోపియన్ యూనియన్' ఆవిర్భావ ఉత్సవాలు జరుపుకుంటారు. 05 మే 1949న 'కౌన్సిల్ ఆఫ్ యూరోప్' ఏర్పడిన తరువాత 1964 నుంచి 'యూరోప్ కౌన్సిల్ దినం' నిర్వహించబడుతున్నది. యూరోప్ డే వేడుకల్లో భాగంగా బ్రెజెల్స్, స్ట్రాస్‌బర్గ్ నగరాల్లోని ఈయూ సంస్థలను (యూరోపియన్ పార్లమెంట్, కౌన్సిల్ ఆఫ్ ఈయూ, యూరోపియన్ కమీషన్, యూరోపియన్ ఎకనమిక్ అండ్ సోషల్ కమిటీ, యూరోపియన్ కమిటీ ఆఫ్ ది రీజియన్) ప్రజల సందర్శనార్థం తెరిచి ఉంచుట జరుగుతుంది. ఈయూ సభ్యదేశాలు ఆధునికత వైపుకు కలిసికట్టుగా ఐక్యతా మంత్రంతో సమగ్రాభివృద్ధి, శాంతియుత సహజీవనం దిశగా అడుగులు వేస్తూ ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలవాలని కోరుకుందాం.

### మెప్మా ఆధ్వర్యంలో ఓటు అవగాహన ర్యాలీ

బోథ్: మెప్మా ఆధ్వర్యంలో ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలోని మహాలక్ష్మివాడ, జై జవాన్ నగర్, తాటి గూడ భాగ్యనగర్, క్రాంతి నగర్ వార్డులలో బుదవారం ఓటు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటు యొక్క ప్రాముఖ్యతను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుల ఆటపాట ప్రజలను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో మెప్మా సిబ్బంది టీఎంసీ భాగ్యలక్ష్మి, సిఓ పన్నాలాల్, సందీప్ రెడ్డి ఆర్పీలు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ పార్టీలో చేరిన టిఆర్ఎస్ నేతలు

నిర్మల్: కాంగ్రెస్ పార్టీ 6 గ్యారంటీలను పకడ్బందీగా అమలు చేస్తామని మాజి కేంద్ర మంత్రి వేణుగోపాల్ చారి, ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్చార్జి కంది శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుదవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ డిస్ట్రిక్ట్ జనరల్ సెక్రటరీ సయ్యద్ షౌకత్ అలీ తో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్, నేతలు లోక ప్రవీణ్, షకీల్, కలీం ఉన్నారు.





# మినీ డ్రెస్‌లో ఆషు రెడ్డి పోజులు

బిగ్ బాస్ షోతో పాపులర్ అయ్యింది ఆషు రెడ్డి. సమంతలా ఉండటంతో జూ సమంతలా మరింత గుర్తింపు తెచ్చుంది. ఇప్పుడు గ్లామర్ షోతోపాటు, సినిమాలతోనూ రచ్చ చేస్తుంది.బిగ్ బాస్ బ్యూటీ ఆషు రెడ్డి మొన్నటి వరకు గ్లామర్ షోనే నమ్ముకుంది. పెద్దగా సినిమా అవకాశాలు లేకపోవడంతో అందాల ఫోటో షూట్లు చేస్తూ కాలం వెల్లదీసింది. అవకాశాల కోసం అన్వేషణ చేస్తూ వచ్చింది. దాని ఫలితం ఇప్పుడు కనిపిస్తుంది. ఆషు రెడ్డి నెమ్మదిగా సినిమా ఆఫర్లని దక్కించుకుంటుంది. "ఫోకస్" మూవీలో పోలీస్ ఆఫీసర్‌గా మెరిసింది. పవర్‌ఫుల్ లేడీ పోలీస్ ఆఫీసర్‌గా మెప్పించింది. ఇప్పుడు బ్యాక్ టూ సినిమా ఆఫర్లని దక్కించుకుంటుంది. ప్రస్తుతం ఆమె "ఏ మాస్టర్ పీస్" అనే చిత్రంలో మరో శక్తివంతమైన పాత్ర పోషిస్తుంది ఆషు రెడ్డి. ఈ మూవీ చిత్రీకరణ పూర్తి చేసుకుని పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుగుతుంది. దీంతోపాటు "యేవమ్" అనే సినిమా చేస్తుంది. ఈ మూవీని ఇటీవలే ప్రకటించారు. ఇందులో ఆమె లుక్ బోల్డ్ గా ఉంది. చాలా బోల్డ్ రోల్‌లో ఈ జూ సమంత మెరవబోతుందని తెలుస్తుంది. "నా బాడీ సూపర్ డీలక్స్" అంటూ ఓ హాట్ ఫోటోని పంచుకున్నారు. ఇందులో ఆషు రెడ్డి తన బాడీని సూపర్ డీలక్స్ గా భావిస్తుందట. అలానే ఫీలవుతుందట. అలాంటి పాత్రలో కనిపించబోతుందట. అదే సమయంలో గ్లామర్ ట్రీట్ ఇస్తూనే ఉంది. ఆమె గ్లామర్ ఫోటోలను సోషల్ మీడియా ద్వారా పంచుకుంటూ అలరిస్తుంది. ఫ్యాన్స్ కి విజువల్ ట్రీట్ ఇస్తూనే ఉంది. ప్రస్తుతం ఆమె మినీ పర్పుల్ కలర్ డ్రెస్‌లో మెరిసింది. చైర్‌పై కూర్చొని వయ్యారంగా పోజులిచ్చింది ఆషురెడ్డి. టాప్ షో చేస్తూ ఆమె కెమెరాకి ఇచ్చిన పోజులు మతిపోయేలా ఉన్నాయంటే అతిశయోక్తి కాదు.



# రూమర్ పై స్పందించిన దేవర బ్యూటీ..

బాలీవుడ్ యంగ్ బ్యూటీ జాన్వీ కపూర్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు.అతిలోక సుందరి శ్రీదేవి కూతురిగా ఈ భామ హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చింది.తన అందం ,నటనతో బాలీవుడ్ లో ఈ భామ వరుస సినిమాలు చేసి ప్రేక్షకులను ఎంతగానో మెప్పించింది.ప్రస్తుతం ఈ భామ వరుస సినిమాలతో బిజీబిజీగా వుంది.మ్యాన్ ఆఫ్ మాసెస్ జూనియర్ ఎన్టీఆర్ హీరోగా నటిస్తున్న దేవర చిత్రంతో ఆమె టాలీవుడ్?లో ఎంట్రీ ఇస్తున్నారు.ఈ చిత్రంలో పల్లెటూరి అమ్మయి తంగం పాత్రను ఆమె పోషిస్తున్నారు. గ్లోబల్ స్టార్ రాంచరణ్ తో కూడా జాన్వీ కలిసి నటించనున్నారు. రాంచరణ్ బుచ్చిబాబు కాంబోలో తెరకెక్కనున్న మూవీ "ఆర్సి 16 " లో జాన్వీ హీరోయిన్?గా నటించనున్నారు.బాలీవుడ్?లో ఈ భామ ప్రస్తుతం మిస్టర్ అండ్ మిసెస్ మహీ, ఉల్జాతో పాటు మరో మూవీ కూడా చేస్తుంది. ఇదిలా ఉంటే శిఖర్ పహారియాతో ఆమె ప్రేమలో ఉన్నారని కొంతకాలంగా రూమర్లు వస్తున్నాయి.జాన్వీ, శిఖర్ కలిసి ఎన్నోసార్లు బయట కనిపించారు. అయితే తిరుపతిలో శిఖర్ పహారియనాను జాన్వీ కపూర్ పెళ్లి చేసుకోనున్నారనే రూమర్ తెగ వైరల్ అయింది.ఆ రూమర్ పై తాజాగా జాన్వీ స్పందించారు.జాన్వీ కపూర్ ,శిఖర్ పహారియా వివాహం తిరుపతిలో జరగనుందంటూ ఓ ఫొటోను ఓ యూజర్ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేయడం జరిగింది.అయితే దీనికి జాన్వీ స్పందించారు. 'కుచ్ బీ' అంటూ ఆ పోస్ట్‌కు జాన్వీ కామెంట్ చేసారు. ఏదైనా రాసేస్తారా అని ఆమె మండిపడ్డారు. తన పెళ్లి గురించి వస్తున్న వార్తల్లో ఎలాంటి నిజం లేదని జాన్వీ తెలిపారు.

# ఫరియా హాట్ కామెంట్స్..

జాతి రత్నాలు ఫేమ్ ఫరియా అబ్దుల్లా గురించి ప్రత్యేక పరిచయాలు అవసరం లేదు.. ఒక్క సినిమాతోనే ఇండస్ట్రీని ఓ ఊపు ఊపేసింది.. ఆ సినిమా సూపర్ హిట్ అవ్వడంతో ఆ తర్వాత వరుస సినిమాలకు గ్రీన్ సిగ్నల్ ఇస్తూ వచ్చింది.ఈ క్రమంలోనే తాజాగా అల్లరి నరేష్ హీరోగా తెరకెక్కిన 'ఆ ఒక్కటి అడక్కు' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది.. ఆ సినిమా మంచి హిట్ టాక్ ను సొంతం చేసుకుంది.. ప్రస్తుతం థియేటర్లలో దూసుకుపోతుంది..ఈ సినిమా ఒకవైపు మిక్స్డ్ టాక్ ను అందుకున్నా కూడా మరోవైపు కలెక్షన్లను కురిపిస్తుంది.. ఇక ఈ సినిమా సక్సెస్ టాక్ ను అయితే అందుకుంది.. ఇదిలా ఉండగా.. ఈ ముద్దుగుమ్మ తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్నది.. ఈ సందర్భంగా ఎన్నో విషయాలను అందరికీ చెప్పింది.. అలాగే తనకు పెళ్లిపై హోప్ లేదు కానీ.. పిల్లలు మాత్రం కావాలంటూ చెప్పుకొచ్చింది.. ఇటీవల ఇంటర్వ్యూ లో పాల్గొన్న ఈమె మాట్లాడుతూ.. 'నా మ్యారేజ్ పైన నాకు హోప్ కూడా లేదు. ఒకవేళ అయితే అవ్వోచ్చు. కానీ కచ్చితంగా నేను పెళ్లి చేసుకోవాలి అని అయితే నాకు లేదు. కానీ నాకు పిల్లలు అంటే మాత్రం చాలా ఇష్టం.. అయితే అమ్మ అవుతాను.. పెళ్లి గురించి ఆలోచించాలి అని చెప్పుకొచ్చింది.. అయితే తండ్రి బాధ్యతలు కూడా ఉండాలి. ఒక చైల్డ్‌ని తల్లీతండ్రి ఇద్దరు కలిసే పెంచాలి. దాంట్లో నాకు డౌట్ లేదు.. కానీ పెళ్లి అనేది ఆలోచించాలి అని చెప్పింది.. ఆ వీడియో కూడా సోషల్ మీడియాలో తెగ వైరల్ అవ్వడంతో నెటిజన్లు కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు..

